క్లుప్తంగా

మార్కెట్, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలన

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం కోదాడ క్రాస్‌రోడ్‌లో నాగరాజు, రాంబాబులు నూతనంగా ఏర్పాటు చేసిన టీ కేఫ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్‌నాయక్, ఎ.అశోక్, మెండె వెంకటేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు అమర్చుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఏఈ శ్రీనివాసులు

కామేపల్లి: రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను తప్పనిసరిగా అమర్చుకోవాలని విద్యుత్ శాఖ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తలింగాల, పాతలింగాల, నెమలిపురి గ్రామాల్లో విద్యుత్ శాఖ పొలంబాటలో భాగంగా వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను అమర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్ లోడ్, విద్యుత్ భద్రతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

ఖమ్మం సహకారనగర్: అపరిచితుల మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీందర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీనియర్ సిటిజెన్స్‌కు నగరంలోని రిటైర్డు గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అపరిచిత లింక్‌లు, వెబ్‌సైట్లు, మెసేజ్‌లను నమ్మకూడదన్నారు. సీనియర్ సిటిజెన్లు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు


రుణాలు అందిస్తున్న సొసైటీ బాధ్యులు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ సొసైటీ ఆధ్వర్యాన రైతులకు నూతనంగా మంజూరైన రుణాలను బుధవారం బోదులబండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ అనంతు కాశయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోదులబండ సొసైటీ పరిధిలోని రైతులకు రూ.30 లక్షలను కొత్తగా రుణాలు మంజూరు కాగా ఇప్పటికే 48 మంది రైతులకు రూ.20.50 లక్షలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగేశ్వరరావు, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ టి.ఇందు, సూపర్‌వైజర్ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	లక్కీ భాస్కర్
సాయిరాం	బఘీర, సింగమ్ అగైన్
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరాన్
సినీ గెలాక్సీ	అమరాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	3
వంకాయ	58		20
బెండకాయ	38	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	38	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	44	తోటకూర	3
దొండ	24		20
పొట్లకాయ	48	గోంగూర	5
చిక్కుడు	100		20
గోరుచిక్కుడు	68	మెంతికూర	2
క్యాబేజీ	38		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		40
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	84		25
క్యాప్సికం	98	-ఖమ్మం వ్యవసాయం	

సమగ్ర సర్వేకు సహకరించాలి

- ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్ డెస్క్, 1077 టోల్ ఫ్రీ
- మొదటి విడతలో కుటుంబాల గుర్తింపు, రెండో విడతలో కుటుంబ సర్వే
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ శ్రీజ


సర్వే సామగ్రిని చూపిస్తున్న డాక్టర్ శ్రీజ, పక్కన అసిస్టెంట్ కమిషనర్, ఆర్‌ఓ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం నిర్వహించే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)కు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కేఎంసీ కమిషనర్ డాక్టర్ శ్రీజ పేర్కొన్నారు. బుధవారం కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వేలో ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలనే ఒత్తిడి ఉండదని, ఎటువంటి పత్రాలను అధికారులు ప్రజల వద్ద నుంచి తీసుకోరని, సర్వే సమయాన ఇంట్లో ఒకరు ఉన్నా సరిపోతుందన్నారు. ప్రస్తుతం కుటుంబాలను గుర్తించేందుకు ఇంటింటికి స్టిక్కరింగ్ కార్యక్రమం ప్రారంభించామని, ఇందులో ప్రతీ ఇంటట్లీ ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని కుటుంబాలకు స్టిక్కర్లు అతికించబడతాయన్నారు.

మూడు రోజుల్లో పూర్తి..

కేఎంసీ పరిధిలో ఉన్న కుటుంబాల సంఖ్య ఆధారంగా ప్రస్తుతం 965 మంది ఎన్యూమరేటర్లతో స్టిక్కరింగ్ చేపట్టామని, ఒకవేళ కుటుంబాల గుర్తింపులో సంఖ్య పెరిగితే ఎన్యూమరేటర్లను పెంచుతామన్నారు. మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయనున్నామని, సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రత్యేక ఐడీ ఇచ్చినట్లు తెలిపారు. ఏదైనా ఫిర్యాదులు చేయాలన్నా, సలహాల కోసం సంప్రదించాలన్నా కేఎంసీలో హెల్ప్‌డెస్క్ లేదా కలెక్టర్ కార్యాలయంలో 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సర్వే సమయాన అందుబాటులో లేని వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని, స్థానిక బిల్ కలెక్టర్, జవాన్లను సంప్రదించవచ్చన్నారు. సర్వేకు సంబంధించిన మెటీరియల్‌ను సిద్ధం చేశామని, ఇప్పటికే ఎన్యూమరేటర్లకు స్టిక్కర్లు అందజేశామని, మిగతా మెటీరియల్‌ను రెండు రోజుల్లో అందిస్తామన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, మేనేజర్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అందరి భాగస్వామ్యం ఉండాలని, అధికారులకు, ప్రజలకు మధ్య సమన్వయం ఏర్పరిచేలా పని చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. కేఎంసీలో ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ శ్రీజతో కలిసి కార్పొరేటర్లతో మేయర్ ప్రత్యేక సమావేశం నిర్వహించిన సందర్భంగా మేయర్ మాట్లాడారు. డివిజన్లలో ఇంటింటి సర్వే సరిగా జరగకపోయినట్లయితే తనకు కాని కమిషనర్‌కు కాని ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చని సూచించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే మార్గదర్శకాలను కార్పొరేటర్లకు వివరించారు. కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రభుత్వం విధించిన గడువులోగా సర్వేను పూర్తి చేస్తామని తెలిపారు.

ఇంటింటి స్టిక్కరింగ్ ప్రారంభం


కామేపల్లిలో సర్వే చేస్తున్న సిబ్బంది

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం మండలం వ్యాప్తంగా ఇంటింటికి స్టిక్కరింగ్ వేశారు. తహసీల్దార్ సుధాకర్ హౌస్ లిస్టింగ్ తీరును పర్యవేక్షించి వివరాల సేకరణలో ఎటువంటి తప్పులు నమోదు కాకుండా చూసుకోవాలని, ఇంటి జాబితా తయారీ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సర్వే సిబ్బంది, సూపర్‌వైజర్లు సమన్వయంతో సర్వే చేపట్టాలన్నారు.

రైతు రాజ్యం కోసం ప్రభుత్వం కృషి


పండితాపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: రైతు రాజ్యం స్థాపన కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో రుణమాఫీ చేయడమే కాక సన్నధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్మాలని, తద్వారా మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. కోఆపరేటివ్ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్, పీఏసీఎస్ చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, పుచ్చకాయల వీరభద్రం, డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవితో పాటు గుజ్జర్లపూడి రాంబాబు, గుగులోత్ సక్రునాయక్, గుగులోత్ గబ్రూనాయక్, మాలోత్ బావ్‌సింగ్, మద్దినేని రమేష్‌బాబు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం


మాట్లాడుతున్న కనకం సైదులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు అందించే ఇళ్ల స్థలాల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని బుధవారం జరిగిన జెడ్పీ అతిథి గృహంలో స్తంభాద్రి జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన మూడు జర్నలిస్టు యూనియన్ల సంయుక్త సమావేశం నిర్ణయించింది. జర్నలిస్ట్ సొసైటీ చైర్మన్ కనకం సైదులు అధ్యక్షన జరిగిన ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు పల్లా కొండల్‌రావు తదితరులు హాజరై మాట్లాడారు. సొసైటీ ద్వారా అర్హులైన జర్నలిస్టులకు సభ్యత్వం ఇచ్చి, ప్రభుత్వం కేటాయించిన స్థలానికి నగదు జమ అంశంపై చర్చించామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టర్లతో పాటు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు నర్వనేని వెంకట్రావు, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా కార్యదర్శి చిర్రా రవి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌టీటీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు పలు సమస్యలను విన్నవించారు. అనంతరం లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. 2010 లిస్ట్ ఆధారంగా చూస్తే చాలామంది అభ్యర్థులు ఇతర ఉద్యోగాలు, వివిధ రంగాల్లో స్థిరపడ్డారని, ఆ తర్వాత వారిని వెరిఫికేషన్‌కు పిలవాలని కోరారు. ఆ కార్యక్రమంలో డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నేలకొండపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎస్‌టీఓ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్‌టీఓకు అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. పీఆర్‌సీ అమలు చేయాలని, వెల్‌నెస్ సెంటర్‌ను పటిష్టం చేయాలని, పెండింగ్ ఏరియర్స్ బిల్లులను చెల్లించాలని తదితర సమస్యలను వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు ఏటుకూరి రామారావు, ప్రధాన కార్యదర్శి చిట్లా భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రావు, జగన్‌మోహన్‌రావు, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, స్వామినాథం, కోదండరామారావు, తోట రామయ్య, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే ప్రధాన ధ్యేయం



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఖమ్మంరూరల్: మహిళల రక్షణే షీ టీం ప్రధాన ధ్యేయమని షీ టీమ్స్ సీఐ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం షీ టీమ్స్ గురించి పోస్టర్ల ద్వారా జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని, ఆకతాయిల వల్ల ఏదైనా ఆపద వస్తుందని తెలిస్తే భయపడకుండా వెంటనే షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. షీ టీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నట్లు, మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగాం వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు చక్రధర్‌రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'నయాబజార్' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్.రామారావు తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. వాలీబాల్‌లో ఎ.గోపినాథ్, ఖోఖోలో కె.మనోజ్‌కుమార్, అథ్లెటిక్స్‌లో జి.వెంకటసాయిలు ప్రతిభ కనబర్చిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం: ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, వెంకట్రాములు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుమలాయపాలెంలో జరిగిన మండల జనరల్ కౌన్సిల్‌లో జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ.. ఉపాధ్యాయులకు సేవలందిస్తూ వారిలో నమ్మకాన్ని ఏర్పరుచుకుంటేనే సంఘం అభివృద్ధి చెందుతుందని, మండల బాధ్యులు ఆ దిశగా పనిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏ (కరువు భత్యం)లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ కమిటీ వేసి కొత్త పే స్కేళ్లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్నికల అధికారి కె.సంధ్యారాణి నూతన మండల కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, లక్ష్మయ్య, శరత్, మల్లికార్జున్, వసంతరాణి, కార్యదర్శులుగా వీరబాబు, వెంకటరాజు, నంద్యా, వీరాస్వామి, జిల్లా కౌన్సిలర్లుగా వీరభద్రం, సత్యనారాయణరెడ్డి, రవికిషోర్, విజయచందర్, నవీన్ నటానేఝెల్, శ్రీహరి, భద్రయ్య ఎన్నికయ్యారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి


ఎర్రగడ్డలో నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: అమరుల ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలనే పిలుపులో భాగంగా బుధవారం మండలంలోని ఎర్రగడ్డ గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మరణించిన మామిడాల శివయ్య, చిర్ర చంద్రయ్య స్మారకస్థూపంపై జెండా ఎగురవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని, దేశ సంపదను మోదీ ప్రభుత్వం అదాని, అంబానీలకు తాకట్టు పెట్టారని ఈ చర్యలను అన్ని వర్గాల ప్రజలు ఏకమై ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, పోలేపొంగ నాగయ్య, వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, పేరాల శ్రీకాంత్, పోటు పెంటయ్య, నాగేశ్వరావు, బాబు, గండుమల్ల రామారావు, కృష్ణ, మాల్సూరు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులపై ప్రత్యేక దృష్టి


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని కోరట్లగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి వివిధ అంశాలపై చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేశ్వరపురం, కోరట్లగూడెం, అమ్మగూడెం తదితర గ్రామాలలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. మండలంలోని సర్వే జిల్లాలో ఆదర్శంగా ఉండేలా ఎన్యూమరేటర్లు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కోరట్లగూడెంలో వివిధ సమస్యలపై ఎంపీడీఓకు కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శి బి.రవి, అంగన్‌వాడీ టీచర్ బచ్చలకూరి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

కామేపల్లి : రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రంగాచార్యులు అన్నారు. బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు అధ్యక్షతన బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో గత, ప్రస్తుత పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందాయని, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజల అవసరాలను పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీకి అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజా ధర్మారావు, ముసలయ్య, భూక్యా శ్రీను, పోలూరి చంద్రయ్య, కొమ్మినేని భద్రయ్య, అమిరినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టండి


మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ తారాదేవి

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన మిరప పంటను ఆశిస్తున్న వివిధ తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అవగాహన కల్పించారు. పంటలో మొదటి దశలోనే తెగుళ్లను గుర్తించినట్లయితే నివారణ సాధ్యమేనని పేర్కొన్నారు.ప్రసుత్తం మిరపలో కొమ్మ కుళ్లుడు సమస్య ఎక్కువగా ఉందని, దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అన్ని రకాల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల గురించి రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వేదిత, కాలం ఉపేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి పాఠ్య పుస్తకాలు అందజేత


విద్యార్థినికి పాఠ్య పుస్తకాలు అందిస్తున్న విజ్ఞాన కేంద్రం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని పి.హర్షితకు బుధవారం రూ.90 వేల విలువైన పాఠ్య పుస్తకాలను బోడెపుడి విజ్ఞాన కేంద్రం వారు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.గీత సహకారంతో ఉచితంగా అందజేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని దుద్దేపుడి గ్రామానికి చెందిన హర్షితకు వైద్య, విద్య ఎంబీబీఎస్ కోర్సు చదవడానికి అవసరమైన పుస్తకాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో బోడెపుడి విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు టి.శివనారాయణ, ఎస్‌కె.అఫ్జల్‌మియా, సీపీఎం వైరా మండల నాయకులు పారుపల్లి శ్రీనాథ్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షమ్మీ, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. నూతన పెన్షన్ విధానం కొనసాగించాలని, విద్యా కమిషన్ ద్వారా విద్యా రంగంలో మార్పులు తీసుకురావాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా టి.గురవయ్య , ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, కె.పద్మ, కోశాధికారిగా జ్యోతి, కార్యదర్శులుగా అరుణ, కోటేశ్వరరావు, నాసరయ్య, వెంకటరమణ, నాగార్జున, ఆడిటర్‌గా రాంబాబు, నవాబ్‌సాహెబ్, జిల్లా ప్రతినిధులుగా మంగేశ్వరీ, ప్రతిమ, అరుణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంజాన్, అరవింద్‌కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన అధికారిణిగా బెల్లం రాధిక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అటవీశాఖలో ఖమ్మం ఎఫ్‌ఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను కేఎంసీకి డిప్యూటేషన్‌పై ప్రభుత్వం నియమించింది. ఈమేరకు నగర మేయర్ పునుకొల్లు నీరజను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

నైపుణ్యాల పెంపునకు ఇంగ్లిష్ దోహదం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచేందుకు గాను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఫ్లూయెన్స్ ఇంగ్లిష్ అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 3 గంటల నుంచి 4:30 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమ సమన్వయకర్త, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.ప్రవీణ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కరాటే జట్టుకు ఖమ్మం వాసి


ఎంపికైన క్రీడాకారుడు సందీప్

ఖమ్మం స్పోర్ట్స్: జేఎన్‌టీయూహైదరాబాద్ యూనివర్సిటీ కరాటే జట్టులో ఖమ్మంకు చెందిన బి.సందీప్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన కరాటే ఎంపికల్లో ప్రథమస్థానంలో నిలిచి త్వరలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగనున్న యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. జిల్లా నుంచి యూనివర్సిటీ జట్టుకు ఎంపిక కావడం పట్ల కరాటే మాస్టర్ గోపతి సైదులు అభినందనలు తెలిపారు.

కమ్మేశాయి..!


కామేపల్లి: బండిపాడు బీటీ రోడ్డును కమ్మేసిన పిచ్చి మొక్కలు


రఘునాథపాలెం: రోడ్డు వెంట పెరిగిన పిచ్చిమొక్కలు

కామేపల్లి/ రఘునాథపాలెం:రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు, పిచ్చి మొక్కలు కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్జిన్ కనబడకుండా పెరగడంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యాన రఘునాథపాలెం మండలంలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ విభాగాలకు చెందిన లింక్ రోడ్లు అన్ని రోడ్లుకు ఇరువైపుల మార్జన్ కనపడకుండా కంపచెట్లు పెరిగాయి. దీంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఖమ్మం నుంచి వయా వీవీపాలెం, వేపకుంట్ల, చింతగుర్తి, గణేశ్వరం రోడ్డు, బల్లేపల్లి నుంచి వయా చెరువుకొమ్ముతండా, వేపకుంట్ల రోడ్డు, కోయచలక, చిమ్మపుడి పాపటపల్లిరోడ్డు, పాపటపల్లి నుంచి కామేపల్లి మండలం పండితాపురం వరకు ఉన్న తారు రోడ్లు, రాంక్యాతండా సూర్యాతండా, పుఠానితండా ఈర్లపుడి, పంగిడి వంటి రోడ్ల మార్జన్‌లో కంపచెట్లు ఏపుగా పెరిగాయి. అలాగే కామేపల్లి మండలంలోని పండితాపురం నుంచి బండిపాడు బీటీ రహదారి ఇరువైపులా పిచ్చి మొక్కలు కమ్మేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.